క్లుప్తంగా

రేపు లోకేశ్వరంలో ఉద్యమకారుల సమావేశం

భైంసాటౌన్/లోకేశ్వరం: తెలంగాణ ఉద్యమ చరిత్ర వివరాల సేకరణను పురస్కరించుకుని ఈనెల 9న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఫోరం జిల్లా నాయకులు రామకృష్ణ గౌడ్, పుండ్లిక్‌రావు, లస్మన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకేశ్వరం మండలకేంద్రంలోని వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 8 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. టీజేఏసీ నాయకులు, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు, ఉద్యమంలో పాల్గొన్నవారు హాజరు కావాలని కోరారు.

25ఏళ్ల అపూర్వ కలయిక..!



పాఠశాల వద్ద పూర్వ విద్యార్థులు

కుంటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని రోజంతా సరదా గా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఈవో భూమి ఆశన్న శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావాల్సిన రైతులు వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఈవో వద్ద టోకెన్ తీసుకుని పీఏసీఎస్‌కు రావాలని సూచించారు. 30 కిలోల జీలుగ బస్తా రాయితీపై రూ.1,116కి అందించనున్నట్లు తెలిపారు.

పిచ్చిమొక్కలు తొలగించాలి



కాలనీలో పరిశీలిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: వీధుల్లో మురుగుకాల్వలను శుభ్రం చేసి అస్తవ్యస్తంగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇంద్రనగర్, గొల్లపేట్ కాలనీల్లో ఆయన పర్యటించారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజ లకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలి



పరిశీలిస్తున్న ఏపీవో గంగాధర్

తానూరు: పదో విడత హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు సిబ్బంది ఏర్పాట్లు చేసుకోవాలని ఈజీఎస్ ఏపీవో గంగాధర్ సూచించారు. శుక్రవారం మండలంలోని కోలూరుతోపాటు పలు గ్రామాల్లో పర్యటించారు. కూలీలతో గుంతలు తవ్వి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపుల ప్రభుత్వ స్థలాలు, పాఠశాలల అవరణలో మొక్కలు నాటేలా చూడాలని పేర్కొన్నారు. వారి వెంట టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

భగీరథపై సమావేశం

కుభీర్: జిల్లా పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మిషన్ భగీరథపై నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. మండలవ్యాప్తంగా భగీరథ నీరు చేరే ఇళ్ల వివరాలు, ఫోన్ నెంబర్లు, పైప్‌లైన్ పరిస్థితులు, ట్యాంకుల వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఉట్నూర్‌రూరల్: అధికారులు సమన్వయంతో పనిచేస్తూ.. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్‌మండలంలోని క్యాంపు కార్యాలయంలో ట్రైబల్ వెల్ఫేర్, పంచాయితీ రాజ్, సోషల్‌వెల్ఫేర్, విద్యుత్‌శాఖ, అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఆయా శాఖల అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కొత్తగా జరిగే అభివృద్ధి పనుల నివేదికలు తమకు ఇవ్వాలని, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

మరమ్మతులు చేయించేవారేరి.?

- గతేడాది వర్షాలకు దెబ్బతిన్న చెరువులు
- కట్ట కింద బీళ్లుగా సాగు భూములు
- బాగు చేయించాలని అన్నదాతల వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



బెల్‌తరోడాలో గండి పడిన చెరువు కట్ట



బెల్‌తరోడా చెరువు కింద భూమిలో రాళ్లు



గండి పడటంతో హిప్నెల్లి చెరువు కట్ట దుస్థితి

తానూరు: గతేడాది కురిసిన వర్షాలకు తానూరు మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువులు దెబ్బతిన్నాయి. హిప్నెల్లి, బెల్‌తరోడా గ్రామాల్లోని చెరువుల కట్టలు తెగిపోగా.. ఆయకట్టు కింద ఉన్న వందలాది ఎకరాల్లో పంటలు కొట్టుకుపోయాయి. సాగుభూముల్లో రాళ్లు, ఇసుక మేటలు చేరాయి. మరికొన్ని గ్రామాల్లో చెరువులకు బుంగలు పడటం, అలుగు కోతకు గురవడం, తూములు శిథిలమయ్యాయి. ఆయా గ్రామాల్లో చెరువుల కట్టలు తెగి వచ్చిన వరదకు పంటలు తెగి నష్టపోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదు. అధికారులు, పాలకులకు విన్నవించినా దెబ్బతిన్న చెరువులకు కూడా మరమ్మతులు చేయించలేదు. దీంతో తాము ఎలా పంటలు సాగు చేసుకునేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు.

తానూరు మండలంలో..

మండలంలో 31 గ్రామపంచాయతీలుండగా వాటి పరిధిలో 27 చెరువులు ఉన్నాయి. ఇందులో గతేడాది వర్షాలకు ఉమ్రి(కె), మొగ్లి, ఝరి(బి), ఖర్బాలా, ఎల్వత్, బోరిగాం, భాగాం, తానూరు గ్రామాల్లోని చెరువుల అలుగులు దెబ్బతిన్నాయి.

నష్టపోతున్న రైతులు..

గ్రామాల్లోని చెరువులకు మరమ్మతులు చేయించకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. చెరువుల కట్టలు తెగి కింద ఉన్న భూముల్లో రాళ్లు, ఇసుక మేటలు ఏర్పడ్డాయి. దీంతో సాగుకు పనికి రాకుండా పోయాయి. ఇప్పుడు మళ్లీ ఖరీఫ్ పనులు మొదలయ్యాయి. దీంతో ఏం చేయాలో తోచడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

వర్షాలకు ముందే పనులు చేయాలి..

గతేడాది కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు చేయించలేదు.

దెబ్బతిన్న చెరువుల కట్ట కింద భూములను సాగుకు సిద్ధం చేసుకుందామనుకుంటే అధికారులు మరమ్మతులు చేయించలేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. వర్షాలు జోరందుకోక ముందే చెరువు కట్టలకు మరమ్మతులు చేయించాలని వేడుకుంటున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



గతేడాది వర్షాలకు మా గ్రామంలోని చెరువు కట్టకు గండి పడింది. దీంతో వందలాది ఎకరాల్లో వరద చేరి పంటలు చేతికి రాకుండా పోయాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. తర్వాత మరమ్మతులు చేయించకపోవడంతో చెరువుల్లో చుక్క నీరు నిల్వ లేదు. ఈసారి వేసవిలో పశువులు దాహార్తి తీర్చుకునేందుకు ఇబ్బంది పడ్డాయి. అధికారులు స్పందించి దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు చేయిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– రాంపటేల్, రైతు, హిప్నెల్లి

ప్రతిపాదనలు పంపించాం

గతేడాది భారీ వర్షాలు కురువడంతో బెల్‌తరోడా, హిప్నెల్లిలో చెరువు కట్టలు తెగిపోయాయి. ఈ చెరువుల మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. వారి నుంచి నిధులు మంజూరవగానే చెరువులకు మరమ్మతులు చేయించి రైతుల సమస్యలు పరిష్కరిస్తాం.

– రామారావ్, నీటిపారుదలశాఖ ఏఈ

బాధిత కుటుంబాలకు దాతల సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు



సాయం అందిస్తున్న మోహన్‌రావుపటేల్

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి) శాంతినగర్ కాలనీలో గత నెల 24న చెట్టు నరికే క్రమంలో విద్యుత్ స్తంభం మైండ్ల చైత్ర అనే బాలికపై పడటంతో కాలు నుజ్జునుజ్జయిన విషయం తెలిసిందే. నిజామాబాద్ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఆర్థిక స్థోమత లేక చిన్నారిని స్వగ్రామం తీసుకొచ్చి వైద్యం చేయిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం గ్రామానికి వెళ్లి పాప వైద్యం కోసం రూ.20వేలను వారి కుటుంబసభ్యులకు ఆర్థికసాయంగా అందజేశారు. పెద్దమనసుతో సాయం అందించిన ఫౌండేషన్ సభ్యులకు పాప కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వర దెల్లి మహేశ్, తోట నర్సయ్య, చౌహాన్ ప్రకాశ్‌లు ఉన్నారు.

ముథోల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన మెత్రి నరేందర్ అనే యువకుడు ఇటీవల ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌తో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రజాట్రస్టు చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోస్లే మోహన్‌రావు పటేల్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారికి రూ.పదివేలు సాయంగా అందించారు. వారి వెంట నాయకులు ఉన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



ఖానాపూర్: బడిబాట ర్యాలీలో మున్సిపల్ చైర్మన్



రాచాపూర్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు



కుంటాల: కల్లూర్‌లో..

ఖానాపూర్: బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. శుక్రవారం పట్టణంలోని రాజీవ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల పరిధిలో ఉపాధ్యాయులు చేపట్టిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విషయ పరిజ్ఞానం కల్గిన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో.. అధికారులతో కలిసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్ తొంటి శ్రీనివాస్, కమిషనర్ మనోహర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శంకర్ బడి ఈడు పిల్లల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాల గురించి వివరించారు.

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైస్‌ఎంపీపీ మౌనిక నవీన్ మాట్లాడుతూ సర్కారు బడుల్లో అందించే సౌకర్యాల గురించి వివరించారు. ఎంఈవో ముత్యం, హెచ్ఎంలు రాజేశ్వర్, అమృతం, సక్రపు గజేందర్, ఎల్లన్న, కార్యదర్శులు రాజబాపు, భోజన్న, సారిక పాల్గొన్నారు.

కనులపండువగా మండల పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు

భైంసాటౌన్: పట్టణంలోని నిర్మల్ రోడ్డులో ఉన్న శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించి 41రోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో మండల పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక యజ్ఞ, యాగాది కార్యక్రమాలు జరిపించారు. వివిధ ప్రాంతాల మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పుష్పార్చన, పూజాది కార్యక్రమాలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు.



సాగు సంబురంగా..

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం వర్షం కురిసింది. దీంతో రైతులు శుక్రవారం వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. భూములను సిద్ధం చేసి పత్తి విత్తనాలను విత్తారు.

ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలి



బోరిగాంలో విద్యార్థితో అధ్యాపకులు

తానూరు: ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని తానూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోరిగాం, బెంబర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన వారి ఇళ్లకు వెళ్లి కళాశాలల్లో ఉన్న వసతులను వివరించారు. ఇంటర్ కోసం దూర ప్రాంత్రాలకు వెళ్లకుండా తానూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశం పొందాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నరేశ్ , లక్ష్మణ్, విజయ్, నగేశ్, సందీప్ ఉన్నారు.

ఈరోజు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: 33/11 కేవీ ఆదర్శనగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 08:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శనగర్, రామ్‌నగర్, గాయత్రీపురం, ఆస్రాకాలనీ, ఈద్‌గాం, భాగ్యనగర్, ఫిష్‌మార్కెట్, సిద్దాపూర్, ఇందిరమ్మ కాలనీ, సోఫీనగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భైంసాలో..

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో నిర్మల్‌రోడ్, రాహుల్‌నగర్, సంతోషిమాతనగర్, పిప్రి కాలనీ, పులేనగర్, వినాయక్‌నగర్, ఓవైసీనగర్, రాజీవ్‌నగర్, మోమినామ్ గల్లీ, బస్టాండ్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: మరమ్మతుల్లో భాగంగా మండలంలోని నర్సాపూర్, లక్ష్మణచాంద విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పెంబి: పెంబి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

చేపమందు పంపిణీ

సారంగపూర్: మృగశిర కార్తెను పురస్కరించుకుని మండలంలోని బీరవెల్లిలో శనివారం ఉదయం 8 గంటలకు చేప మందు పంపిణీ చేయనున్నట్లు సగ్గం సోదరులు లింగం, కృష్ణ తెలిపారు. చేపమందు పంపిణీకి గ్రామ వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు. చేప మందు కోసం కరీంనగర్ నుంచి ప్రత్యేకంగా చేపపిల్లలు తెప్పించామన్నారు. మృగశిర కార్తె రోజున చేపమందు తీసుకుంటే ఆస్తమా, ఉబ్బసం వ్యాధులు దూరం అవుతాయని ఈప్రాంత వాసుల విశ్వాసం.

రాజశ్యామలాదేవి ఆలయంలో పూజలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ శ్రీ రాజశ్యామలాదేవి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం హోమం, కుంకుమార్చన నిర్వహించారు. మధ్యాహ్నం ప్రత్యేక హారతి తర్వాత భక్తులకు అన్నదానం చేశారు.

ప్రజల కోసం నిబద్ధతతో పని చేస్తాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు

భైంసాటౌన్: వివక్షకు తావు లేకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతతో పని చేస్తామని మాజీ ఎమ్మెల్యే బి. నారాయణరావు పటేల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్‌కు ఓటువేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్ల శాతం పెరిగిందన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని.. గెలిచినా, ఓడినా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పట్టణంలోని శివారు కాలనీలతోపాటు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రూ.26కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. 30 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని, గెలిస్తే సంబరపడటం.. ఓడితే కుంగిపోయే గుణం తనది కాదని ఇతర పార్టీల నాయకులనుద్దేశించి అన్నారు. ప్రజలకు నచ్చకపోతే ఎంతటి వారినైనా ఓడిస్తారన్నారు. రామమందిరం నిర్మించిన యూపీలోనే బీజేపీకి తక్కువ సీట్లు రావడం ఇందుకు నిదర్శనమన్నారు. పదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌కు ఎంపీ ఎన్నికల్లో చాలా చోట్ల డిపాజిట్ రాలేదని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు శంకర్ చంద్రే, ఓం ప్రకాశ్ లడ్డా, రాంచందర్‌రెడ్డి, ఎంఏ లతీఫ్, తదితరులున్నారు.

విద్యుత్ సమస్యలుంటే సంప్రదించాలి

భైంసాటౌన్: భైంసా డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యలు ఉంటే ఏఈలకు సమాచారం అందించాలని వినియోగదారులకు సూచించారు. ఈ మేరకు కార్యాలయాల ఫోన్ నంబర్లతోపాటు ఏఈల సెల్ నంబర్లు అందుబాటులో ఉంచామని అన్నారు. సమస్యలు తలెత్తినప్పుడు ఆయా నంబర్లకు సమాచారమిస్తే విద్యుత్ సిబ్బంది వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని ఆయన పేర్కొన్నారు.

ఏఈలు, కార్యాలయాల ఫోన్‌నంబర్లు..

ప్రాంతం	అధికారి నం.	కార్యాలయ నం.
భైంసా ఏడీఈ	94408 11688	–
భైంసాటౌన్ ఏఈ	94408 11709	94910 75591
భైంసారూరల్ ఏఈ	83339 23869	73826 33857
కల్లూర్ ఏఈ	94408 11713	94910 75595
కుభీర్ ఏఈ	94408 11711	94910 75597
బాసర ఏడీఈ	73310 34974	–
బాసర ఏఈ	79016 78170	94910 75599
ముథోల్ ఏఈ	94408 11712	94910 75598
లోకేశ్వరం ఏఈ	94408 11710	94910 75592
తానూర్ ఏఈ	94408 14880	94910 75601

మృగశిర కార్తె సందడి



ఖానాపూర్ మార్కెట్‌లో చేపలు కొంటున్న ప్రజలు

ఖానాపూర్: మృగశిర కార్తెను పురస్కరించుకొని శుక్రవారం చేపల విక్రయాలు జోరుగా సాగాయి. పట్టణంలోని లారీ అడ్డా చేపల మార్కెట్‌తోపాటు ఎన్టీఆర్ చౌరస్తా, గంగపుత్ర వీధి, అంగడిబజార్ చౌరస్తాతోపాటు సత్తన్‌పల్లి, గోసంపల్లె తదితర గ్రామాల్లో సందడి నెలకొంది. పలువురు నేరుగా చెరువుల వద్దకే వెళ్లి చేపలు కొనుగోలు చేశారు. మృగశిర కార్తె(మిరుగు) దృష్టిలో ఉంచుకొని పలువురు రైతులు తమ చేన్లలో దుక్కి పనులను ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువుల వద్ద ప్రజల సందడి నెలకొంది. రైతులు చేన్లలో పత్తి విత్తనాలు నాటారు.